క్లుప్తంగా

చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): చేతుల పరిశుభ్రత ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో వాష్ స్టేషన్‌ను సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కౌన్సిలర్ అడపా వెంకయ్యనాయుడు, మోటూరు సుధీర్, కుమ్మరి శ్రీనివాస్, మెప్మా సీఎంఎం దయావతి పాల్గొన్నారు.

కూనపరాజుపర్వలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం కూనపరాజు పర్వ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలందించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభమైన సంగతి తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి వెంకటేశ్వరరావు, తోటకూర రవిబాబు, డాకారపు సుబ్బారావు, నాగేశ్వరరావు, శ్రీను, సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాస్, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి డా. రవికుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



ఇబ్రహీంపట్నం: మండలంలోని మూలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ వేణు సోదరుడు ఎస్.సతీష్ ఇటీవల అనారోగ్యంబారిన పట్టాడు. గొల్లపూడిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందున్న సతీష్‌ను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శుక్రవారం పరామర్శించారు.

రైతులకు అండగా ప్రభుత్వం



జి.కొండూరు: ఇటీవల తుపానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని సలహా మండలి అధ్యక్షుడు హనుమంతురావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రబీసాగు, విత్తనాలు, ఎరువులు, ఈ క్రాప్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

కోడిపందేల బరి ధ్వంసం



నూజివీడు: కోడిపందేల నిర్వహణను పోలీసులు ఉక్కుపాదంతో అణిచివేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు సంక్రాంతికి కోడిపందేలు, పేకాట నిర్వహణకు అనుమతి లేనందున ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు మండలంలోని రావిచర్లలో కోడిపందేల నిర్వహణకు సిద్ధం చేసిన బరిని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేశారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లయితే డయల్ 100, 112కుగాని, ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 83329 59175కు సమాచారాన్ని తెలియజేయాలని ఎస్సై పేర్కొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తిరువూరు: వాహనాలు నడిపేటపుడు డ్రైవర్లు రహదారి నిబంధనలు తప్పక పాటించాలని ఏసీపీ ఎం రమేష్ సూచించారు. తిరువూరులో ఆటోలు, ట్రాక్టరు డ్రైవర్లకు పోలీసుశాఖ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ వ్యవసాయ సీజన్లో ట్రాక్టర్లకు లౌడ్‌స్పీకర్లు పెట్టుకుని నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని, డ్రైవర్లు వేగనియంత్రణ పాటించాలని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు లేకుండా వాహనాలు నడపవద్దని తెలిపారు. తిరువూరు సీఐ నబీ, ఎస్ఐలు సతీష్, పద్మారావు, సర్కిల్లోని ఏకొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ఉల్లాసంగా సాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని 3వ సచివాలయం క్రికెట్ టీమ్ వరుస విజయాలతో సంచలనాలు సృష్టిస్తోంది. సచివాలయ స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభతో మండల స్థాయికి దూసుకెళ్లింది. అక్కడ కూడా కొండపల్లి మున్సిపాలిటీ 3వ సచివాలయం, ఇబ్రహీంపట్నం 5వ సచివాలయం టీమ్‌లపై వరుస విజయాలు నమోదు చేసుకుంది. మున్సిపాలిటీ సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల కృష్ణ క్రీడాకారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటాలని వారు ఆకాంక్షించారు.



కొండపల్లిలో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో విజేత ఫెర్రీ టీమ్‌ను అభినందించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయని ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో ఖోఖో, వాలీబాల్ పోటీలకు 14 టీంలు వచ్చాయని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో ఏ.కొండూరు తండా సచివాలయం ప్రథమ స్థానం, ఖోఖోలో కంభంపాడు సచివాలయం-2 ప్రథమస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

క్రికెట్ విజేత నూగొండపల్లి జట్టు

ఆగిరిపల్లి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన క్రికెట్ ఫైనల్స్‌లో నుగొండపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కొత్త ఈదర జట్టు, నూగొండపల్లి జట్టు క్రికెట్ పోటీలో హోరాహోరీగా తలపడ్డాయి. నూగొండపల్లి జట్టు విజేతగా నిలిచింది. సర్పంచ్‌లు లింగవరపు రమేష్, జోల భూషణం, శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు ప్రసాదు, సంగమయ్య, పుల్లారావు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా శుక్రవారం కబడ్డీ, షటిల్, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. షటిల్ పురుషుల విభాగంలో జంగంగూడెంపై తూర్పు దిగవల్లి, తుక్కులూరుపై నెప్రూపేట, గాంధీనగర్‌పై గొల్లపల్లి గెలుపొందింది. షటిల్ మహిళల విభాగంలో ఎంప్లాయిస్ కాలనీపై అమ్మవారితోట, ధంధం గార్డెన్‌పై నెహ్రూపేట విజయం సాధించాయి. పురుషుల కబడ్డీలో యనమదలపై మీర్జాపురం గెలుపొందింది. పురుషుల వాలీబాల్ లో బూర్వంచపై జంగంగూడెం, ఎంప్లాయిస్ కాలనీపై గాంధీనగర్-1 గెలుపొందాయి. మహిళల ఖోఖోలో దిగవల్లిపై మీర్జాపురం, ఎంఎన్‌పాలెంపై యనమదల జట్లు విజయం సాధించాయి. పురుషుల క్రికెట్‌లో వెంకటాయపాలెంపై సీతారామపురం, బోర్వంచపై ముక్కొల్లుపాడు, యనమదలపై మీర్జాపురం జట్లు విజయం సాధించాయి. ఈ పోటీలను పీడీలు రాజేంద్రప్రసాద్, రవీంద్ర, ఆరతి, నాగేశ్వరరావు, లక్ష్మి, వనజ, రాజేశ్వరి, సరళ, రాణి, నాగమణి, స్వప్న నిర్వహించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి పురుష, మహిళా షటిల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. పెద్ద కొమిర పురుషుల, గంపలగూడెం-2 మహిళల షటిల్ టీములు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు తిరువూరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గుర్రం గోపాలరావు తెలిపారు.

ముసునూరులో..

ముసునూరు: ముసునూరు హైస్కూల్లోని క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ఫైనల్స్ దశకు చేరుకున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. పీడీలు ఆలీ, సుకుమార్, నాగరాజు నాగమల్లేశ్వరమ్మ సమర్థవంతంగా పోటీలు నిర్వహిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రానికి వెలువడిన తుది ఫలితాలను ఎంపీడీఓ వివరించారు. కబడ్డీ పోటీల్లో గుళ్లపూడి, అక్కిరెడ్డిగూడెం జట్లు తమ ప్రత్యర్థి జట్లపై విజయాలు సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. 17, 18, 19 తేదీల్లో క్రికెట్ పోటీల అనంతరం అన్ని ఆటల ఫైనల్ పోటీలు 20వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరాము, సీనియర్, జూనియర్ సహాయకులు సగ్గుర్తి, సన్నీ రాజన్ పాల్గొన్నారు.



ముసునూరు మండల స్థాయి ఫైనల్స్‌లో గుళ్లపూడి కబడ్డీ జట్టు

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడల పోటీలు శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. సచివాలయ స్థాయిలో గెలుపొందిన టీంలకు డబుల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, ఎంఈఓ సుధాకర్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సురేష్, ఇన్‌చార్జి ఈఓ మురళి పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో కికెట్ విజేత నూగొండపల్లి జట్టు



నూజివీడులో వాలీబాల్ పోటీలో తలపడుతున్న యువత



గంపలగూడెం మండల స్థాయిలో షటిల్ విన్నర్ పెద్దకొమిర

సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలి

ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నాలుగున్నరేళ్లుగా ప్రజల అభ్యున్నతికి పాటుపడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలిచి రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని తూర్పుదిగవల్లిలో గ్రామ సచివాలయం భవనాన్ని, రైతుభరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించడంతో పాటు కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న తారురోడ్డు నిర్మాణానికి, మర్రిబంధం నుంచి ఎంఎన్‌పాలెం మీదుగా పల్లెర్లమూడి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తూర్పుదిగవల్లిలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ హామీలన్నింటిని అమలు చేసి చూపించారన్నారు. ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, జగ్గవరపు విజయ, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, రైతు సలహా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పల్లె రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ విజయకుమార్, ఏఓ చాముండేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్యామ్ పాల్గొన్నారు.



తూర్పు దిగవల్లిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద

మైలవరం: భారత దేశం గర్వించదగిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని గౌరవ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నేషనల్ యూత్ ఫెస్టివల్ డే, సంక్రాంతి సంబరాలు ఎన్ఎస్ఎస్ యూనిట్, ప్రకృతి క్లబ్, ఎస్ఎస్ఎస్‌తో కలిసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్ర పటానికి లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి, కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మాట్లాడుతూ విద్యార్థినులు సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించడం అవసరమన్నారు. రంగోలీ అనేది అదృష్టాన్ని స్వాగతించే సంప్రదాయమన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకృతులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు లకిరెడ్డి జయప్రకాష్ రెడ్డి, లకిరెడ్డి అన్నపూర్ణ నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

తిరువూరు: స్వామివివేకానంద జయంతి సందర్భంగా తిరువూరులో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. వాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో వివేకానంద విగ్రహానికి ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువతకు వివేకానంద బోధనలను వివరించారు.



మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జయప్రకాష్‌రెడ్డి



గంపలగూడెం మండల పెనుగొలనులో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి

పెనుగొలనులో..

గంపలగూడెం: గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో కూడార్సై ఉత్సవం

తిరువూరు: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తిరువూరులోని పలు ఆలయాల్లో శుక్రవారం కూడార్సై ఉత్సవం నిర్వహించారు. 108 రకాల నివేదనలను గోదాదేవికి సమర్పించారు. తిరుప్పావై పఠిస్తూ పూజలు నిర్వహించారు. వేంకటాచలస్వామి దేవస్థానం, కోదండ రామాలయం, శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయం, రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయాల్లో ధనుర్మాస కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపారు.



లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కూడార్సై ఉత్సవం

భక్తిశ్రద్ధలతో కుడార్సై ఉత్సవం

ఆగిరిపల్లి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ శోభనాచల వ్యాగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కూడార్సై ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి వారికి గోదాదేవికి ఉదయం సుప్రభాత సేవ, నిత్య ఆరాధన, విశేష స్నపన, తిరుప్పావై సేవ కాలం, 108 గంగాళాలలో విశేష ప్రసాదం నివేదన సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వాసవి మహిళా మండలి భక్త బృందం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తిరువూరు వేంకటాచలస్వామి ఆలయంలో కూడార్సై ఉత్సవం

ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు

ముసునూరు: ముస్లింల శ్మశానవాటికకు రక్షణ వలయం(ఫెన్సింగ్), బోరు ఏర్పాటు చేసి, అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ చెప్పారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశాలతో గోపవరంలోని ముస్లిం శ్మశానవాటికను వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నేతలు పరిశీలించి, కొలతలు వేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోని ముస్లిం సోదరుల శ్మశానవాటిక అభివృద్ధికి జగనన్న పాలనలో మోక్షం కలుగుతుందన్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించనున్నట్ల తెలిపారు. దీంతో 0.40 సెంట్లు విస్తీర్ణం కలిగిన శ్మశానవాటిక చుట్టూ 170 మీటర్ల పొడవున ఐరన్ ఫెన్సింగ్‌తోపాటు, బోరు కూడా వేయించి, మంచినీటి సౌకర్యం కల్పించనున్నట్లు నేతలు చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్ కంచర్ల వాణి పాల్గొన్నారు.



ముస్లింల శ్మశానవాటికకు కొలతలు వేయిస్తున్న నాయకులు

నేడు ఎమ్మెల్యే పర్యటన

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మండలంలో శనివారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ కె దుర్గాప్రసాదు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 11 గంటలకు తుమ్మగూడెంలో రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తారని, మధ్యాహ్నం 12 గంటలకు పోతనపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో విద్యార్థుల ఎంపిక

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎనిమిది మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ట్రిపుల్ ఈ విద్యార్థులు స్పైడర్ ఎలక్ట్రిక్ కంపెనీ నిర్వహించిన రాతపరీక్ష, ఇంటర్వ్యూలలో పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల నిర్వాహకులు అభినందించారు.

పంట నమోదు తప్పనిసరి

ఏ.కొండూరు: రబీ సీజన్లో పంట సాగు చేసి రైతులందరూ తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి టిప్పు సుల్తాన్ పేర్కొన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో శుక్రవారం జరిగిన పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ జియో కో ఆర్డినేట్స్ ఆధారంగా పంట సాగు చేసిన సర్వే నంబర్‌కి వెళితేనే పంట నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి

గంపలగూడెం: ఆర్ఎంపీల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ఆర్ఎంపీల సమైక్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న విజయవాడలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే కృష్ణమూర్తి తెలిపారు. గంపలగూడెంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చలో విజయవాడ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.

సంక్రాంతి సంబరాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. 9, 10వ తరగతి విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఫస్ట్‌క్లాస్ చిన్నారులకు భోగిపండ్లు పోశారు. హరిదాసు, పిట్టలదొర, జంగరదేవర వేషధారణతో విద్యార్థులు అలరించారు. ముగ్గులు వేసి భోగి మంటలు వేశారు. కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నారు. పొంగళ్లు చేసి బాలబాలికలకు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: సంక్రాంతి పండుగతో సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు చాటాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దువ్వూరి పద్మావతి అన్నారు. ముసునూరులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద ఏపీఎం కుంటం బాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి, పొంగళ్లు, పిండి వంటలు చేసి, పతంగాలను ఎగురవేయించి, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారందరికీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాల్లో సీసీలు సతీష్, సుజాత, లలిత, సిబ్బంది పాల్గొన్నారు.



కొండపల్లిలో హరిదాసుకు దానం చేస్తున్న బాలికలు



ముసునూరులో సంక్రాంతి సంబరాల్లో ముగ్గుల పోటీ

తమ్మిలేరుపై తాత్కాలిక రహదారి పునరుద్ధరణ

ముసునూరు: గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాలు, వరదల ఉద్ధృతికి పూర్తిగా పాడైపోయిన, బలివే వద్ద తమ్మిలేరుపై తాత్కాలిక రహదారిని గ్రావెల్‌తో పూడ్చే పనిని గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ చేపట్టారు. వాహనాలు, రాకపోకలు కొనసాగించేందుకు వీలుగా గుంతలను, గండ్లను పూడ్పించి, పెద్ద పెద్ద తూరలు వేయించి, గ్రావెల్‌తో రహదారిని పునరుద్ధరించారు. దీంతో శుక్రవారం నుంచి రెండు జిల్లాల మధ్య రాకపోకలకు కలుగుతున్న ఆటంకాలు తొలగిపోయాయి. రహదారిని పునర్నిర్మించిన సర్పంచ్ దంపతులను నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ప్రత్యేకంగా అభినందించారు.



బలివే వద్ద తమ్మిలేరు తాత్కాలిక రహదారి నిర్మాణ పనులు

పేదలకు ఉచిత వైద్యసేవలు

వేమిరెడ్డిపల్లి (విస్సన్నపేట): పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని వేమిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పి.విజయకుమారి అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం జెడ్పీ హైస్కూల్ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కె.సురేష్, పంచాయతీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

సీఎంఎస్ చర్చికి రూ.3 లక్షల వితరణ



జి.కొండూరు: మండలంలోని విద్యానగరం సీఎంఎస్ చర్చికి రూ.3 లక్షల విలువగల టైల్స్‌ను అందించేందుకు ప్రముఖ పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం ముందుకు వచ్చారు. విద్యానగరంలోని చర్చిని కోగంటి సత్యం శుక్రవారం సందర్శించారు. చర్చి అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన చర్చి నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో గరిపాటి జైపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు వైద్యం

గుళ్లపూడి(గంపలగూడెం): గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి, ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తోందని మండల ప్రత్యేక అధికారి నాగరాజు తెలిపారు. గంపలగూడెం మండలం గుళ్లపూడిలో ఆరోగ్య సురక్ష-2 భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఊటుకూరు పీహెచ్‌సీ వైద్యులు సురేష్, ఆర్థోపెడిక్ వైద్యులు సురేష్, గైనకాలజిస్ట్, ఆప్తమాలజిస్ట్ రోగులను పరీక్షించారు. ఎంపీటీసీసభ్యుడు విశ్వనాథం, ఈఓపీఆర్డీ బాబు రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముత్తయ్య,సత్యం పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ

రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ సంఘ అధ్యక్షుడు ఉయ్యూరు అంజిరెడ్డి అన్నారు. కొత్తరెడ్డిగూడెంలో శుక్రవారం పాల ఉత్పత్తిదారుల సంఘం నందు 2022–23 సంవత్సరానికి గాను సంఘం ఆర్జించినలాభాలలో 164మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1,38,000 బోనస్‌ను ఆయన పంపిణీ చేశారు.

జూదాల నిషేధంపై పోస్టర్ల విడుదల

తిరువూరు: సంక్రాంతి జూదాల నిర్వహణపై ప్రభుత్వం విధించిన నిషేధంపై అవగాహన కల్పిస్తూ పశుసంవర్థక శాఖ రూపొందించిన వాల్ పోస్టర్లను తిరువూరులో శుక్రవారం ఆవిష్కరించారు. రెవిన్యూ డివిజనల్ అధికారి మాధవి, తహసీల్దారు సురేష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎస్సై పద్మారావు, పశువైద్యాధికారులు శ్వేత, స్వప్న, వీఎల్‌ఏ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ

పింఛన్ నగదు సద్వినియోగం చేసుకోవాలి

గుళ్లపూడి(గంపలగూడెం): పింఛన్ నగదును లబ్ధిదారులు సద్వినియోగపరచుకోవాలని మండలంలోని గుళ్లపూడి సర్పంచ్ వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 139 మందికి ఈ నెలలో నూతనంగా పెన్షన్ మంజూరు అయింది. కాగా ఆయా గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పింఛన్ పంపిణీ చేశారు. గుళ్లపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముత్తయ్య పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com